తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

సోమవారం / 26.02.2024

హైదరాబాద్ ప్రజలకు మరో శుభవార్త

తెలంగాణ వీణ , హైదరాబాద్ : హైదరాబాద్‌లో ట్రాఫిక్ పరిస్థితి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఎన్ని ఫ్లైఓవర్లు కట్టినా.. ఇంకెన్ని అండర్ పాసులు నిర్మించినా.. రోజు రోజుకీ పెరిగిపోతున్న జనాభా వల్ల ట్రాఫిక్ సమస్యలు తీరటం లేదు. నగరంలో ఇప్పటికే దాదాపు 12 వేల కిలో మీటర్ల మేర రోడ్లు విస్తరించి ఉన్నా.. ట్రాఫిక్ సమస్య వెంటాడుతూనే ఉంది. కొన్ని ప్రాంతాల్లో అయితే.. కిలోమీటర్ ప్రయాణానికి కూడా గంట సమయం పడుతుండటం గమనార్హం. అయితే.. నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించిన కాంగ్రెస్ సర్కార్.. మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రద్దీగా ఉన్న పలు కీలక మార్గాల్లో అండర్ గ్రౌండ్ టన్నెల్స్ నిర్మించేందుకు ప్రాణాళికలు సృష్టిస్తోంది.అయితే.. ప్రస్తుతమున్న రోడ్లు ఇరుకుగా ఉండటం, విస్తరించేందుకు వీలు లేకుండా భారీ భవనాలు అడ్డుగా ఉండటంతో.. ఇక అండర్ గ్రౌండ్ టన్నెళ్ల నిర్మాణమే ఏకైక మార్గమని అధికారులు సీఎం రేవంత్ రెడ్డికి నివేధిక అందించారు. ఈ మేరకు.. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే మార్గాలైన.. ఐటీసీ కోహినూర్ నుంచి ఖాజాగూడ, నానక్‌రాంగూడా మీదుగా విప్రో సర్కిల్ వరకూ 9.5 కి.మీ మేర భారీ అండర్ గ్రౌండ్ టన్నెల్‌ను నిర్మించేందురు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇక ఐటీసీ కోహినూర్ నుంచి మైండ్‌స్పేస్ జంక్షన్ మీదుగా జేఎన్‌టీయూ వరకు 8 కి.మీ మేర టన్నెల్ నిర్మాణానికి ప్లాన్ రెడి చేస్తున్నారు.ఐటీసీ కోహినూర్ నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నెం.45 మీదుగా రోడ్ నెం.10 వరకు దాదాపు 6.5 కిమీ మేర మరో టన్నెల్ నిర్మించాలని యోచిస్తున్నారు. వీటితో పాటు జీవీకే మాల్ నుంచి మాసబ్ ట్యాంక్ మీదుగా నాలాన్‌నగర్ వరకు 6 కి.మీ టన్నెల్ మార్గాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇక.. నాంపల్లి నుంచి చార్మినార్ మీదుగా చాంద్రాయణ గుట్ట ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు 9 కి.మీ మేర అండర్ గ్రౌండ్ టన్నెల్ నిర్మించేందుకు సిద్ధమయ్యారు. ఈమేరకు ఈ ఐదు టన్నెళ్లకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో.. భవిష్యత్తులో హైదరాబాద్ రూపురేఖలు మారిపోవటమే కాకుండా.. నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలు పూర్తిగా తీరనున్నాయని ప్రభుత్వం చెప్తోంది.

కుప్పంలో సీఎం జగన్ వ్యాఖ్యలకు దేవినేని ఉమా కౌంటర్

తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో : కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం వద్ద ఏర్పాటు చేసిన వైసీపీ సభలో సీఎం జగన్ టీడీపీ అధినేత చంద్రబాబుపై తీవ్ర విమర్శనాస్త్రాలు సంధించిన సంగతి తెలిసిందే. 35 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న చంద్రబాబు కుప్పం నియోజకవర్గానికి ఏంచేశారని నిలదీశారు. తాము కుప్పం నియోజకవర్గానికి కృష్ణా నీటిని తీసుకువచ్చామని చెప్పారు. ఈ నేపథ్యంలో, సీఎం జగన్ వ్యాఖ్యలపై టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమా బదులిచ్చారు. "చంద్రబాబు డ్యాములో నీళ్లు నిలబెట్టాడు. రిజర్వాయర్లలో నీళ్లు నిలబెట్టాడు. రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు హంద్రీనీవా పనులను 672 కిలోమీటర్ల మేర పరుగులు తీయించారు. ఆ 672 కిలోమీటర్లు పనులు నేనే పూర్తి చేశానని సిగ్గు లేకుండా చెప్పుకుంటావా? చిత్రావతి, గండికోట, పులివెందుల లిఫ్ట్ కింద ఎక్కడైనా ఒక్క ఎకరానికి నీరిచ్చావా? గాలేరు-నగరి సుజల స్రవంతిని గాలికి వదిలేశావు కదా! తెలుగుగంగ పనులేమైనా ముందుకెళ్లాయా? రాయలసీమ లిఫ్ట్ ఉద్ధరిస్తానన్నావు... ఏమైపోయింది? ఎన్ని వందల కోట్లు ఖర్చు పెట్టావు... సమాధానం చెప్పే దమ్ము ధైర్యం ఉందా? నువ్వా రాయలసీమను ఉద్ధరించింది? మీరు ఖర్చు పెట్టామని చెప్పుకుంటున్న రూ.22 వేల కోట్లలో ఏ ప్రాజెక్టుకు ఎంత ఖర్చు పెట్టారో చెప్పే దమ్ము ధైర్యం ఉందా మీకు, మీ ఇరిగేషన్ మంత్రికి? దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలి. రాయలసీమకు మీరు కేటాయించినట్టు చెప్పుకుంటున్న రూ.2,011 కోట్లలో ఏ ప్రాజెక్టుకు నీరిచ్చావు జగన్ రెడ్డీ... ఏ రిజర్వాయర్ కు నీళ్లిచ్చావు జగన్ రెడ్డీ... ఏ కాలువకు నీళ్లు వెళ్లాయి జగన్ రెడ్డీ? మేం దమ్ము ధైర్యంతో చెబుతున్నాం... హంద్రీనీవా కాలువకు మేం 40-45 టీఎంసీల నీళ్లు నడిపించాం. కర్నూలు, అనంతపురంకు నీళ్లిచ్చాం. చిత్తూరుకు నీళ్లు తీసుకెళ్లాం. కుప్పం బ్రాంచి కెనాల్ లో రెండో లిఫ్టు నుంచి మూడో లిఫ్టుకు నీళ్లు తీసుకురావడానికి 57 నెలలు పట్టిందని, రూ.30 కోట్లు ఖర్చు పెట్టానని నువ్వు డబ్బా కొట్టుకుంటావా, నువ్వు ఉద్ధరించినట్టు చెప్పుకుంటావా? ఎన్నికలకు పట్టుమని 40 రోజులు లేవు... నీ మూడు రిజర్వాయర్ల డ్రామాలు ఏంటి జగన్ రెడ్డీ?" అంటూ దేవినేని ఉమా ధ్వజమెత్తారు.కుప్పం కెనాల్ మీద చంద్రబాబు హయాంలో 87 శాతానికి పైగా పనులు పూర్తయితే, మిగిలిన 13 శాతం పనులు కూడా పూర్తి చేయలేని దద్దమ్మ, అసమర్థ ముఖ్యమంత్రి జగన్... నీ బడాయి కబుర్లకు అర్థముందా? అని నిలదీశారు.

రూ.500లకే సిలిండర్ పథకం.. ముందు మొత్తం ధర చెల్లించాల్సిందే!

తెలంగాణ వీణ , హైదరాబాద్ : ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. మంగళవారం మరో రెండు పథకాలను ప్రారంభించనున్న విషయం తెలిసిందే. 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకాలు అమల్లోకి రానున్నాయి. కాగా, సాధారణతో పాటు ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఉన్నవారిని కూడా మహాలక్ష్మి పథకం కిందికి తీసుకువస్తోంది. అయితే, లబ్ధిదారులు గ్యాస్ సిలిండర్ తీసుకున్నప్పుడు పూర్తి మొత్తాన్ని చెల్లించాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయం తీసుకుంది. అనంతరం రూ.500కు అదనంగా చెల్లించిన ధరను ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా రీయింబర్స్ చేయడానికి సిద్ధమవుతోంది.ఇందులో కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం చెల్లిస్తున్న రాయితీని కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో సిలిండర్ ధర రూ.955 ఉంటే.. లబ్దిదారుడు చెల్లించాల్సిన రూ.500, కేంద్ర రాయితీ రూ.40 పోను మిగతా రూ.415ని రాష్ట్ర ప్రభుత్వ రాయితీగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని సమాచారం.అయితే, నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ఒక్కోచోట ఒక్కో ధర ఉంది. హైదరాబాద్‌లో రూ.955 ఉంటే.. మిగత పట్టణాల్లో రూ.970, 974గా ఉండటానికి రవాణా ఛార్జీల వ్యత్యాసమే కారణం. రాష్ట్రంలో 11.58 లక్షల ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీరికి కేంద్రం నుంచి సిలిండర్‌కు రూ.340 రాయితీ లభిస్తోంది. మహాలక్ష్మి పథకంలో ఎంపికైన లబ్దిదారులు సిలిండర్‌కు చెల్లించే ధరలో కేంద్ర రాయితీ పోను.. మిగతా మొత్తం రూ.500 కంటే ఎంత ఎక్కువ ఉంటే అంత మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనున్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు సిలిండర్ ధర రూ.970 ఉందనుకుంటే లబ్దిదారుడు చెల్లించాల్సిన రూ.500, కేంద్ర రాయితీ రూ.340 పోను రూ.130ని రాష్ట్ర ప్రభుత్వ రాయితీగా జమ చేస్తుంది. దూర ప్రాంతాలకు ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలతో సిలిండర్ ధర అదనంగా ఉన్నా ఆ భారం ప్రజలపై పడొద్దని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.మరోవైపు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు మహాలక్ష్మి పథకం కింద లబ్దిదారుల జాబితాలను జిల్లాల వారిగా అధికారులు సోమవారం అందజేయనున్నట్టు సమాచారం. అడ్వాన్సు మొత్తాన్ని కూడా చెల్లించనుంది. ఈ మేరకు రూ.80 కోట్ల విడుదలకు అనుమతిస్తూ పౌరసరఫరాల శాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. లబ్ధిదారులకు ఇచ్చే సిలిండర్ల సంఖ్యను బట్టి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ మొత్తం ఎప్పటికప్పుడు ఆయిల్ కంపెనీలకు జమయ్యేలా ఏర్పాట్లు చేస్తోంది.

నా పేరును రాజకీయాలకు వాడుకోవద్దు: మోహన్ బాబు వార్నింగ్

తెలంగాణ వీణ , హైదరాబాద్ : ఏపీలో ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ.. మాజీ ఎంపీ, సినీనటుడు మంచు మోహన్ బాబు సంచలన లేఖ విడుదల చేశారు. తన పేరును రాజకీయాలకు వాడుకోవద్దని పార్టీలకు సూచిస్తూనే.. అలాంటి పనిచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటానంటూ వార్నింగ్ ఇచ్చారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఓ లేఖ విడుదల చేశారు.ఈ మధ్య కాలంలో తన పేరును ఉపయోగించుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందన్న మోహన్ బాబు.. ఏ పార్టీ వారైనా తన పేరును వారి స్వప్రయోజనాల కోసం వాడుకోవద్దని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. అలాగే మనం అనేక రకాల భావావేశాలున్న వ్యక్తుల ప్రపంచంలో జీవిస్తున్నామనీ.. ఎవరి అభిప్రాయాలు వారివని చెప్పుకొచ్చారు.ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత అభిప్రాయాలు ఉంటాయన్న మోహన్ బాబు.. అది వారి వారి వ్యక్తిగతమని లేఖలో పేర్కొన్నారు. చేతనైతే నలుగురికి సాయపడడంలో దృష్టిపెట్టాలి గాని, సంబంధం లేని వారిని రాజకీయ పార్టీలలోకి, వారి వారి అనుబంధ సంస్థల్లోకి తీసుకురావడం బాధాకరమని అన్నారు. తనకు అండదండగా ఉన్న ప్రతి ఒక్కరికి అభివందనాలు తెలియజేస్తున్నానన్న మోహన్ బాబు.. శాంతి , సౌభ్రాతృత్వాలను వ్యాపింపజేయడంలో అందరం బద్ధులై ఉందామని కోరుకుంటూ, ఉల్లంఘించిన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.మరోవైపు మోహన్ బాబు గతంలో టీడీపీ నుంచి ఎంపీగా పనిచేశారు. 2019 ఎన్నికల సమయంలో మంచు కుటుంబం వైసీపీకి మద్దతు ఇచ్చింది. అలాగే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబంతోనూ మంచు ఫ్యామిలీకి బంధుత్వం ఉంది. అయితే గత కొంతకాలంగా మోహన్ బాబు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయడం లేదు. అయితే ఇటీవల జరిగిన ఓ ప్రెస్‌మీట్లో పోసాని కృష్ణమురళి మోహన్ బాబు ప్రస్తావన తీసుకువచ్చారు.